క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ ఇందుమతి

పూసపాటిరేగ : గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి ఎస్.ఇందుమతి అన్నారు. మండలంలోని కుమిలి గ్రామంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను విద్యార్థులు పఠనం చేసి విజ్ఞానం సంపాదించాలన్నారు. అనంతరం వివిధ పోటీ లలో గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంటు కృష్ణసాయి, తిరుమలరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పూసపాటిరేగ : మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ నుంచి కొవ్వాడ అగ్రహారం పురాతన శివాలయం వరకు సుమారు రూ.25 లక్షల సొంత నిధులతో నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. ఎస్ఎంఎస్ పరిశ్రమ నుంచి కొవ్వాడ అగ్రహారం శివాలయం కలుపుతూ 2 కిలోమీటర్ల పొడవులో 40 అడుగుల వెడ ల్పుతో రహదారి పనులకు సర్వే పూర్తి కావడం తో పనులు ప్రారంభమయ్యాయి. కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోట్ల రఘు సొంత నిధులు సుమారు 25 లక్షలతో రహదారి పనులు సాగు తున్నాయి. రహదారి నిర్మాణంతో వ్యవసాయ భూములు మధ్య రవాణా సులభతరం కావ డంతో పాటు వ్యవసాయ భూములకు ప్రాము ఖ్యత పెరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సా ర్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేబార్కి అప్పారా వుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొ న్నారు.

పదో తేదీ నుంచి నమాజ్ పుస్తకాల పంపిణీ

విజయనగరం టౌన్: బక్రీద్ పర్వదినం పురస్క రించుకుని ఈ నెల 10 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముస్లింలకు ఉచితంగా నమాజ్ పుస్త కాలను పంపిణీ చేయనున్నట్లు పట్టణ శాఖ ముస్లిం ప్రతినిధి మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహర్రం ఉత్స వాలు ముగించే వరకు పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

లెవిల్ క్రాసింగ్‌పై అవగాహన

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే దారిలో ఉన్న లెవిల్ క్రాసింగ్ వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లెవిల్ క్రాసింగ్‌లో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సివిల్ డిఫెన్స్ సభ్యులు, సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా సిబ్బంది పట్టాలు దాటే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసు కోవాలని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సేఫ్టీ అధికారి ఎంకే సాహు, డివిజనల్ పీవే ట్రూనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సి పాల్ సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పె క్టర్ కేవై రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులపై నిరంతర పర్యవేక్షణ

చీపురుపల్లి: చీపురుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 19 మద్యం షాపులపై నిరంతర పర్యవే క్షణ చేస్తున్నట్లు సీఐ చక్రవర్తి తెలిపారు. శని వారం ఆయన మాట్లాడుతూ.. 19 మద్యం షాపుల పర్యవేక్షణకు 'ఎక్సైజ్ ఐ' అనే యాప్‌ను వినియోగించడంతో పాటు సిబ్బందిని కేటా యించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరు వ్యాపారం చేసినా చర్యలు తప్పవ న్నారు.

కుంగిన ఆర్‌అండ్‌బీ వంతెన..

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పది గ్రామాల ప్రజలు
- శిథిలమైన ముంగినాపల్లి వద్ద దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు
- మట్టి కుప్పలు వేసి దారి మళ్లిస్తున్న అధికారులు



వాహనాల రాకపోకలను మళ్లించేందుకు అడ్డంగా వేసిన మట్టిదిబ్బలు



ముంగినాపల్లి వద్ద కుంగిన కల్వర్టు ఇదే

విజయనగరం (డెంకాడ): అధికారుల నిర్లక్ష్యం... ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపానికి నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే విజయనగరం – గణుపూరుపేట – పూసపా టిరేగ మార్గంలో ముంగినాపల్లి వద్ద శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టు (ఆర్‌అండ్‌బీ వంతెన) అడుగు లోతు కుంగిపోయినా తక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీం తో అటుగా రాకపోకలు సాగించే పది గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం నరకమే..

విజయనగరం నుంచి గుణుపూరుపేట మీదుగా పూసపాటిరేగలో గల 16వ నంబర్ జాతీయ రహ దారికి చేరుకునే ఆర్‌అండ్‌బీ రోడ్డులో గత పక్షం రోజులుగా ప్రయాణం ప్రయాసగా మారింది. ఈ మార్గంలో భారీ ఇసుక లోడులతో పెద్ద పెద్ద లారీలు రాకపోకలు సాగించడంతో దశాబ్దాల కిం దట ముంగినాపల్లి వద్ద నిర్మించిన కల్వర్టు కుంగిపో యింది. దీంతో కల్వర్టుపై రాకపోకలు సాగించకూ డదంటూ రెండు వైపులా బారికేడ్లు, మట్టి దిబ్బలు వేశారు. చిన్నపాటి వాహనాలు ముంగినాపల్లికి సమీపంలో ఉన్న కొత్తకొల్లాం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇది కూడా చిన్నపాటి రోడ్డు కావడంతో పెద్ద వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. పైగా ఈ మార్గం కూడా మట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే ద్విచక్ర వాహనచోదుకలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి కల్వర్టు కుంగిపోయి పక్షం రోజులవుతాన్నా సంబం ధిత అధికారులు చర్యలు వేగవంతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్త మవుతున్నాయి. దీంతో నిత్యం అటుగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కొం దరు వాహనచోదకులు మట్టిదిబ్బల పైనుంచి కుం గిన కల్వర్టు మీదుగా ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభ విస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

రద్దీ ఎక్కువ..

డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన పలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. విద్య, ఉపాధి కోసం జిల్లా కేంద్రానికి వేల సం ఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుం టారు. ప్రస్తుతం కల్వర్టు కుంగిపోవడం, కొత్త కొల్లాం మీదుగా వెళ్లే రోడ్డు ఇరుకుగా మారడం తో కిరాయిపై తిప్పే వాహన యజమానులు సాహసించడం లేదు. ఇదిలా ఉండగా మరికొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో ఆయా ప్రాంతాల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థలకు విద్యార్థులు రావాల్సి ఉంది. దీంతో వారు చదువుకు తమ పిల్లలు ఎలా వెళ్తారన్న ఆందోళనలో తల్లిదండ్రులున్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికా రులు పక్క మార్గంలో గ్రావెల్‌తో రోడ్డు వేసే చర్యలు చేపడుతున్నారు. దీంతో నూతన కల్వర్టు నిర్మించేంత వరకు తమకు కష్టాలు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

మాది పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామం . ప్రతిరోజూ ఉదయాన్నే పొలంలో పండించే కూరగాయలను విజయనగరంలో విక్రయి స్తాను. కొద్ది రోజుల కిందట ముంగినాపల్లి వద్ద కల్వర్టు కుంగిపోవడంతో ఆటోలు సక్రమంగా తిరగడం లేదు. దీంతో విజయనగరం వెళ్లేం దుకు ఇబ్బంది పడుతున్నాం. ప్రతిరోజూ ఈ రోడ్డులో వేలాది మంది రాకపోకలు సాగిస్తుం టారు. వారందరూ అదే పరిస్థితి అనుభవిస్తు న్నారు. సొంత వాహనాలున్న వారు ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. కిరాయి ఆటో లపై ఆధారపడిన మా లాంటి వాళ్లకు కష్టాలు తప్పడం లేదు.

– ఎం. రామయమ్మ, రైతు, కుమిలి గ్రామం, పూసపాటిరేగ మండలం

ప్రత్యామ్నాయ మార్గం నిర్మిస్తున్నాం..

విజయనగరం నుంచి గుణుపూరుపేట మీదుగా పూసపాటిరేగ వెళ్లే ప్రధాన మార్గంలోని ముంగి నాపల్లి వద్ద కల్వర్టు కుంగిపోయింది. కల్వర్టు ని ర్మించి 50 సంవత్సరాలు దాటింది. నూతన కల ర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పం పించాం. ఈ మార్గంలో రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.3.90 లక్షల నిధులు వెనక్కి మళ్లిపోయాయి. ఆ నిధులు మం జూరైతే నూతన కల్వర్టు నిర్మాణ పనులు ప్రారం భిస్తాం. అప్పటివరకు ప్రత్యామ్నాయంగా కల్వ ర్టు పక్క భాగంలో వాహనాల రాకపోకలకు వీ లుగా మార్గం నిర్మిస్తున్నాం. – కె.శ్రీనివాసరావు, డీఈఈ ఆర్‌అండ్‌బీ, భోగాపురం.

ఉపాధ్యాయుల బదిలీలకు..
మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ : ఉపాధ్యాయుల బదిలీలకు మాన్యు వల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ యూనియన్ నాయకులు కెళ్ల గోవిందనాయుడు, కొప్పల అప్పలరాజులు డిమాండు చేశారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయు లతో కలిసి శనివారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వెబ్ కౌన్సెలింగ్ వలన ఉపాధ్యాయులు ఇబ్బంది పడతా రన్నారు. జిల్లాలో సుమారు 1200 ఖాళీలు వుండగా వాటన్నింటికి వెబ్ ఆప్షన్ ఇవ్వడం చాలా కష్టతరం అన్నారు. బదిలీల కౌన్సెలింగ్ బాయ్‌కాట్ చేసి ఈ నెల 8వ తేదీన డీఈవో కార్యాలయం ముట్టడి చేస్తా మన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయ కులు పి.వైకుంఠరమణ, గంగాధర్, సుందరమ్మ, పెంకి శ్రీనివాసరావుతో పాటు పలువురు యూని యన్ నాయకులు పాల్గొన్నారు.

బదిలీ ప్రక్రియలో అసంబద్ధాలను సవరించాలి

నెల్లిమర్ల: ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో ఇప్పటివ రకు జరిగిన అసంబద్ధాలను సవరించాలని మండ లానికి చెందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు నెల్లిమర్ల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈవో సూర్య నారాయణమూర్తికి ఉపాధ్యాయులు శనివారం విన తిపత్రం అందజేశారు. పాఠశాల విద్య కార్యదర్శి ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయు లకు కూడా మాన్యువల్‌గా బదిలీ కౌన్సెలింగ్ నిర్వ హించాలన్నారు. చాలామంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీ పెట్టుకోగా వెబ్ సైట్లో తప్పనిసరి బదిలీగా చూపించడంతో వారంతా వెబ్ ఆప్షన్ పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తుది సీనియారిటీ జాబితా విడుదల చేయకుండా, గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలామంది ఉపాధ్యాయులు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్టీయూ సంఘాల ప్రతినిధులు పతివాడ త్రినాథ్, ఉండ్రు శ్రీనివాసరావు, కెఎస్ఎస్ గణేష్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రపంచ ప్రార్థనా దినోత్సవానికి తరలిరండి



ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న క్రిస్టియన్ ఫెడరేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయనగరం క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ నున్న ప్రపంచ ప్రార్థనా దినోత్సవానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు విజయనగరం క్రిస్టియన్ ఫెడరేష న్, ఫెలోషిప్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు రెవ రెండ్ బీఎం.రాజు, డాక్టర్ ఎం.ఐజక్ తెలిపారు. శనివారం స్థానిక అయ్యన్నపేట రెవరెండ్ సునీల్ సంఘ కార్యాలయం ఆవరణలో ప్రార్థనా దినో త్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవి ష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆది వారం సాయంత్రం 6.30 గంటల నుంచి గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ప్రార్థనా దినోత్సవం భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రపం చ శాంతికి, భారతదేశ క్షేమం కాంక్షించే దైవజ నులు, సంఘ నాయకులు, విజయనగర పట్టణ క్రైస్తవ విశ్వాసులు తరలిరావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో కోశాధికారి బిషప్ ఎం. పాల్సన్, ప్రతినిధులు ఎల్.మధుసూదనరావు, రెవరెండ్ ఎస్.మధు, రేగాన ఆనంద్, పట్నాన పైడిరాజు, వివేక్, రెవరెండ్ మధుమనోహర్, యబ్బోజు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



బాధితురాలికి నగదు, నిత్యవసరాలు అందిస్తున్న సర్పంచ్

భోగాపురం: మండలం సవరవిల్లి పంచాయతీ రామదాసుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అం డగా సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి నిలి చారు. శనివారం బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన వంతుగా రూ.10వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్సా ర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం..

విజయనగరం: యోగాతో మానసిక ఒత్తిడి దూరం కావడంతో ఉల్లాసంగా జీవించవచ్చని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర – 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం స్థానిక దాసన్నపేట రైతుబజార్ వద్ద యోగాసనాలు వేశారు. ఆంధ్ర యూనివ ర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చైతన్యవం తులై ప్రతిరోజూ యోగాసనాలు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమం లో క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ అకాడమీ విద్యార్థుల సత్తా..



ఎం.సాయి సుస్మిత రెడ్డి (492)



టి.ఖ్యాతి (492)



వి.లక్ష్మీసరయు (489)



ఎస్.విఘ్నేష్ (489)

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో పట్ట ణంలోని ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఎంఈసీలో ఎం.సాయిసుస్మిత రెడ్డి, టి.ఖ్యాతి 500 మార్కులకు 492 మార్కులు సాధిం చినట్లు డైరెక్టర్ అంట్యాకుల రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వి.లక్ష్మీసరయు, ఎస్.విఘ్నేష్ ఎంఈసీలో 489 మార్కులతో రాణిం చారన్నారు. ఈ మేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

డంపింగ్ యార్డుగా క్రీడా మైదానం



క్రీడా మైదానంలో విచ్చలవిడిగా వేసిన వ్యర్థాలు

- పట్టించుకోని అధికారులు..



గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వ్యర్థాల డంపింగ్ యార్డుగా మారి పోయింది. పాఠశాలకు సుమారు నాలుగు ఎకరాల క్రీడా మైదానం ఉంది. కొత్త వలస పట్టణంలో ఏ ప్రభుత్వ సభలు, సమావేశాలు నిర్వ హించాలన్నా ఈ మైదానమే దిక్కు. విజయనగరం – కొత్తవలస రోడ్డును ఆనుకుని ఉన్న ఈ మైదానంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు ట్రాక్టర్లతో వ్యర్థాలను తీసుకువచ్చి వేసేస్తున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం జిల్లా, మండల స్థాయి అధికా రులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ ఈ అక్రమ డంపింగ్‌పై ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికే మైదానంలో కొంత ప్రాంతం ఆక్రమణకు గురైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదానంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.